అక్రమ నిర్మాణం కూల్చివేత

వెంగళరావునగర్, మార్చి 20: అక్రమంగా నిర్మించిన భవనాన్ని బల్దియా అధికారులు కూల్చివేశారు. రహ్మత్‌నగర్‌లో గద్వాల శారదాబాయి ఇంటి స్థలాన్ని పక్కింటి బుచ్చయ్య కొంత మేర కబ్జా చేసి భవనం నిర్మించాడు. బాధితురాలు పోలీసులకు, జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. బుధవారం పఠాన్‌చెరు డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సురేశ్, శేరిలింగంపల్లి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తమ సిబ్బందితో పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. అక్రమకట్టడానికి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మద్దతుగా నిలిచి అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొంత ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. కోర్టు ఆదేశాలను అమలు చేస్తున్నామని అధికారులు తేల్చిచెప్పి అక్రమ కట్టడాన్ని కూల్చివేశారు.

కుష్టు లక్షణాలపై అవగాహన

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 20: లెప్రెసి వ్యాధిని గుర్తించి సరైన జాగ్రత్తలు తీసుకోవాలని అడిషనల్ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ అరుణ అన్నారు. జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కేసుల గుర్తింపు, ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బుధవారం మైలార్‌దేవ్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలో కేసులను గుర్తించి, నిర్ధారణ చేయడం, ఉచితంగా మందులు అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. లెప్రె అనే బాక్టీరియా ద్వారా ఈ వ్యాధి వస్తుందని, లెప్రెసీ లక్షణాలపై అవగాహన కల్పించారు. పీఎంవో సులోచన తదితరులు పాల్గొన్నారు.

విద్య కాషాయీకరణకు కేంద్రం కుట్ర

ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

హిమాయత్‌నగర్, మార్చి 20: విద్యను కాషాయీకరణ చేసేందుకే కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానం తీసుకువచ్చిందని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. శాస్త్రీయ విద్య విధానం కోసం విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యను ప్రైవేటీకరణ చేయడంతోపాటు ప్రభుత్వ విశ్వ విద్యాలయాలను నిర్వీర్యం చేసేందుకు విదేశీ విశ్వ విద్యాలయాలకు అనుమతి ఇచ్చారని విమర్శించారు. కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేసేందుకు కేంద్రం కుటిల ప్రయత్నం చేస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన హామీలను అమలు చేయడంలో విఫలమైన బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు అశోక్ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, నాయకులు ఇటికాల రామకృష్ణ, రఘురాం, క్రాంతి, నరేశ్, వెంకటేశ్, నెల్లి సత్య, రాజు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

సమాజ మనుగడలో ఊరపిచ్చుకల పాత్ర

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సైంటిస్టు రవీందర్‌రెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 20: సమాజ మనుగడలో ఊరపిచ్చుకల పాత్ర ఎంతో ఉందని,వాటిని కాపాడాల్సిన బాధ్యత అందరిదని ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, అఖిల భారత సకసేరుక చీడపీడల యాజమాన్య విభాగం ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ జడ్పీ పాఠశాలలో ఊరపిచ్చుకల జీవన విధానంపై ఐ లవ్ స్పారోస్ బృందంతో అవగాహన నిర్వహించారు. పిచ్చుకలు గతంలో పంటలపై చీడ పీడలను నాశనం చేసి రైతుకు అండగా ఉండేవన్నారు. టెక్నాలజీ పెరిగే కొద్దీ అవి పిచ్చుకలు అంతరించిపోతున్నాయన్నారు. స్పారోస్ కోసం కృత్రిమ పిచ్చుక గూళ్లు ఉచితంగా పంఫిణీ చేశారు. పిచ్చుకలను కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అనురాధ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హీరా గ్రూప్ చైర్ పర్సన్ అరెస్ట్ అవాస్తవం

- **ఇన్వెస్టర్లను గందరగోళ పర్చేందుకు తప్పుడు ప్రచారం**

బంజారాహిల్స్, మార్చి 20: హీరా గ్రూప్ చైర్‌పర్సన్ నౌహీరా షేక్ అరెస్ట్ అయ్యారంటూ కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని సుప్రీంకోర్టు న్యాయవాది, హీరా గ్రూప్ లీగల్ సెల్ హెడ్ వరప్రసాద్ అన్నారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్ నం.10లోని హీరా గ్రూప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరప్రసాద్ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఇన్వెస్టర్ల వద్ద నుంచి వసూలు చేసిన డబ్బులను తిరిగి చెల్లించే ప్రక్రియలో ఉన్నామని చెప్పారు. ఇదిలా ఉండగా ఇటీవల హైదరాబాద్ ఈడీ అధికారులు నాంపల్లిలో నౌహీరా షేక్ బెయిల్ రద్దు చేయాలంటూ వేసిన పిటిషన్‌ను మంగళవారం న్యాయస్థానం డిస్మిస్ చేసిందని తెలిపారు. అయితే కొందరు నౌహీరా షేక్ అరెస్టయిందని, బెయిల్ రద్దయిందంటూ మార్ఫింగ్ ఆర్డర్‌తో తప్పుడు ప్రచారం మొదలు పెట్టారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ఈడీ అధికారులకు సమన్వయం లేకుండా వ్యవహరిస్తున్నారని వివరించారు. సమావేశంలో హీరా గ్రూప్‌నకు చెందిన న్యాయవాదులు రఘుబాబు, హేమా జాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న న్యాయవాది

నూతన గవర్నర్‌ను కలిసిన టీటీడీ బోర్డు సభ్యుడు

ఖైరతాబాద్, మార్చి 20: తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన సీపీ రాధాకృష్ణన్‌ను టీటీడీ బోర్డు లోకల్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు, శ్రీమాన్ గ్రూప్ ఎండీ అనూప్ చక్రవర్తి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పిచ్చుకలపై ఉపన్యాసంలో విద్యార్థులు ప్రతిభ

జూబ్లీహిల్స్, మార్చి 20: కేబీఆర్ ఉద్యానవనంలో బుధవారం అటవీశాఖ నిర్వహించిన ప్రపంచ పిచ్చుకల దినోత్సవంలో యూసుఫ్‌గూడ ఎంజీఎం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఉపన్యాస పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని హిమవాణి ప్రథమ, చిత్రలేఖనంలో సీబీఎస్ఈ 3వ గ్రేడ్ విద్యార్థిని జినీషా ప్రథమ, సీబీఎస్ఈ 6వ గ్రేడ్ విద్యార్థి రితేశ్‌కుమార్ తృతీయ బహుమతులు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎంఎం నాయుడు, ప్రిన్సిపాల్ కిరణ్ నాయుడు విద్యార్థులను అభినందించారు.

మట్టి డంపింగ్‌తో ఘర్షణ.. పరస్పర కేసులు

మణికొండ, మార్చి 20: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వినాయకనగర్‌కాలనీలో ఓ ఇంటి ముందు నుంచి మట్టి ట్రాక్టర్లు నడుపుతుండటంతో దుమ్ము వస్తుందంటూ తలెత్తిన వివాదం బిల్డరు, ఓ కుటుంబం మధ్య బుధవారం ఘర్షణకు దారితీసింది. వివరాల్లోకి వెళితే.. పుప్పాలగూడ వినాయక్ నగర్ ఫేస్-2లో ఉంటున్న ఆకుల రమేశ్, సంజన దంపతుల ఇంటి ముందున్న ఓపెన్ ప్లాటు స్థానిక బిల్డర్ ఉపేందర్‌రెడ్డిది. ట్రాక్టర్ల ద్వారా మట్టిని తన ప్లాట్‌లో పోస్తున్నాడు. దీంతో నిత్యం దుమ్ము రావడంతో రమేశ్ దంపతులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం మట్టి పోస్తుండగా రమేశ్ ట్రాక్టర్ తాళాలు తీసుకుని ట్రాక్టర్ డ్రైవర్‌పై దాడికి దిగారు. దీంతో బిల్డర్, అతని సిబ్బంది రమేశ్‌పై దాడిచేయడంతో తలకు గాయమైంది. ఇరువర్గాల ఫిర్యాదుతో నార్సింగి పోలీసులు ఆవుల సంజనపై, రమేశ్‌ను గాయపర్చిన బిల్డర్‌తోపాటు అనుచరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

బంజారాహిల్స్, మార్చి 20: బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని గ్లోబల్ గ్రామర్ స్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకున్నది. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్యం, సాగునీటి ప్రాజెక్టులు, ట్రాఫిక్ సమస్యలు తదితర అంశాలపై విద్యార్థులు రూపొందించిన సుమారు 120కి పైగా నమూనాలు ప్రదర్శించారు.

సెక్టోరియల్ అధికారుల నియామకం

సెక్టోరియల్ అధికారులతో సమావేశమైన ఆర్డీవో వెంకట్‌రెడ్డి

బండ్లగూడ, మార్చి 20: రానున్న పార్లమెంట్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సెక్టోరియల్ అధికారులను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కొప్పుల వెంకట్‌రెడ్డి ఆదేశించారు. రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయంలో నూతనంగా నియమించిన 49 మంది సెక్టోరియల్ అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని 535 పోలింగ్ స్టేషన్లను పరిశీలించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మాడల్ కోడ్‌ను కండక్ట్ చేసేందుకు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

మల్లు స్వరాజ్యం పోరాటం స్ఫూర్తిదాయకం

మణికొండ, మార్చి 20: ఐక్య పోరాటాలు చేసి తమ హక్కుల సాధనకు నిరంతరం పోరాడిన వీరనారి మల్లు స్వరాజ్యం అని రంగారెడ్డి జిల్లా సీపీఎం కార్యవర్గ సభ్యుడు డి.జగదీశ్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ నెమలినగర్‌లో సీపీఎం నాయకురాలు స్వరాజ్యం వర్ధంతి నిర్వహించారు. సీపీఎం గండిపేట మండల కన్వీనర్ జాజాల రుద్రకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సాయుధ పోరాట ఫలితంగా తెలంగాణలో 3 వేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలు ఏర్పడ్డాయని, 10 లక్షల ఎకరాలు పేదలకు పంపిణీ చేశారని గుర్తుచేశారు. అనేక పోరాటాలు చేసిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో గండిపేట సీపీఎం నాయకులు ఎం. అశోక్, నాగేశ్‌గౌడ్, లక్ష్మణ్ కుమార్‌గౌడ్, మహేశ్‌యాదవ్, వీరేశ్, రఘు, రామాంజనేయులు, సురేశ్, సీఐటీయూ మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, ఐద్వా నాయకురాలు, మణికొండ మున్సిపాలిటీ కార్యదర్శి శివాణి, అధ్యక్షురాలు రేణుక, సావిత్రి, రమ్య, నందిని పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

బంజారాహిల్స్, మార్చి 20: జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రిలోని ఆమోదగిరి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సముద్రాల శ్రీనివాసాచార్యులు, గోవర్ధనాట్యాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ద్వారతోరణ. ధ్వజకుంభ అరాధన, కలశాభిషేకం, శతకలశ, సాయంత్రం విష్ణు సహస్రపారాయణం, పల్లకీ సేవ తదితర పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అపోలో గ్రూప్స్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం

ఖైరతాబాద్, మార్చి 20: మహిళలకు ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు సఫా స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందని ఆ సంస్థ చైర్‌పర్సన్ రుబీన్ నఫీజ్ ఫాతిమా తెలిపారు. ఔత్సాహిక మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు తీజరా పేరుతో చేపట్టనున్న కార్యక్రమ బ్రోచర్లను బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంస్థ ప్రతినిధులు అహ్మద్ అలీ, ఇమామ్ హుస్సేన్ మనీషా గోతి, రిజ్వానా అక్తర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే తమ సంస్థ ఆధ్వర్యంలో ఎంబ్రాయిడరీ, టైలరింగ్, వంట, ఆరోగ్య, ఇన్ఫర్మేషన్ ఎనేబుల్డ్ సర్వీసెస్, రిటైల్ మేనేజ్‌మెంట్, మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ రంగాల్లో యువతులు, మహిళలకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా బాల్‌రాజ్

బాల్‌రాజ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర పాడిపరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ జ్ఞానేశ్వర్, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

బండ్లగూడ, మార్చి 20: కాంగ్రెస్ పార్టీలో అనేక ఏండ్లుగా సేవలందిస్తున్న కోరని బాల రాజ్‌ను రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. పార్టీ నాయకులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర పాడి పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ జ్ఞానేశ్వర్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి నియామకపత్రాన్ని బాల్‌రాజ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. పార్టీ తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నేరవేర్చుతానన్నారు. కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపాల్టీ అధ్యక్షుడు గడం శేఖర్‌యాదవ్, దనుంజయ్, బ్లాక్ అధ్యక్షుడు ఖలీద్, తాజుద్దీన్, ఇస్మాయిల్, శ్యామ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో అప్రజాస్వామిక పాలన నడుస్తోంది..

మాట్లాడుతున్న భూపాల్‌గౌడ్

ఖైరతాబాద్, మార్చి 20: దేశంలో ప్రస్తుతం అప్రజాస్వామ్య పాలన నడుస్తున్నదని ఆల్ ఇండియా బ్యాక్‌వర్డ్ పీపుల్ సునామీ పార్టీ జాతీయ అధ్యక్షుడు భూపాల్‌గౌడ్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఎన్నికల్లో ఓట్లు కొనడం, అమ్ముకోవడం పరిపాటిగా మారిందని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారన్నారు. ఓట్లు కొన్న వారి ఎన్నికను రద్దు చేయాలని, క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న వారిని శిక్షించాలని, ఈ విషయంపై దేశంలోని 140 కోట్ల మంది ప్రజల పక్షాన తాను సుప్రీం కోర్టులో పిల్ వేశానని తెలిపారు. 76 ఏండ్లుగా రాజకీయం అనేది దేశంలో అవినీతిమయంగా మారిందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కు ద్వారా ప్రజలే తమకు తాముగా అవినీతిని ప్రక్షాళన చేయాలని పిలుపునిచ్చారు.

వైద్య వ్యర్థాలతో పొంచి ఉన్న ముప్పు

వెంగళరావునగర్, మార్చి 20 : వైద్య వ్యర్థాలను కుప్పలు తెప్పలుగా పడేస్తుండటంతో ముప్పు పొంచి ఉంది. సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడ లా కాలేజ్ ఎదుటు ఉన్న ఓ ఖాళీ స్థలంలో దవాఖానల్లోని బయో వ్యర్థాలను ఇక్కడ తెచ్చి కుప్పలుగా పోస్తున్నారు. వీటిలో గడువు తీరిన మందులు, సూదులు, సిరంజుల చెత్తంతా తెచ్చి పోస్తున్నారు. అనంతరం వాటిని వేరు చేసి మరో ప్రాంతానికి గుత్తేదారు తరలిస్తున్నాడు. దీంతో ఈ ప్రాంతంలో దుర్గంధం వ్యాపిస్తున్నది. కుప్పలుగా తెచ్చి పడేసే మెడికల్ వ్యర్థాల సమస్యపై జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు మూసివేత.. స్థానికుల ఆందోళన

- **బైరాగిగూడ - నార్సింగి రోడ్డు మూసి రేకుల షెడ్డు వేసిన వ్యక్తి**
- **రాకపోకలకు ఆటంకం కలుగుతుండటంతో తొలగింపు**

రోడ్డుపై అక్రమంగా వేసిన షెడ్డును తొలగించాలని ఆందోళన చేస్తున్న స్థానికులు

బండ్లగూడ/ మణికొండ, మార్చి 20: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్, నార్సింగి మున్సిపాలిటీలకు మధ్య ఉన్న రోడ్డును మూసి వేస్తూ ఓ వ్యక్తి షెడ్డును ఏర్పాటు చేశారు. దీంతో నిత్యం అనేకమంది వాహనదారులతోపాటు పాదచారులకు ఇబ్బందిగా మారింది. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ, బైరాగిగూడ, హైదర్షాకోట్, పిరంచెరువు గ్రామాలతోపాటు అనేక కాలనీలవాసులు నిత్యం బైరాగిగూడ నుంచి నార్సింగికి వెళ్లే రహదారి వెంట రాకపోకలు కొనసాగిస్తుంటారు. కాగా మంగళవారం ఓ వ్యక్తి ఆ రోడ్డును మూసి వేస్తూ రేకుల షెడ్డును నిర్మించాడు. దీంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. బుధవారం ఆయా గ్రామాల ప్రజలు, కాలనీవాసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని రేకుల షెడ్డును తొలగించాలని ఆందోళన చేపట్టి అధికారులు, నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆ షెడ్డును తొలగించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్‌పై అవిశ్వాసం

బండ్లగూడ, మార్చి 20: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌పై గురువారం అవిశ్వాస తీర్మానానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్పొరేషన్ పరిధిలోని 21మంది కార్పొరేటర్లలో 16 మంది కార్పొరేటర్లు గతంలో మేయర్ మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాసం పెట్టారు. అవిశ్వాసం తీర్మానం కాలం ముగియడంతో మేయర్ మహేందర్‌గౌడ్ కోర్టుకు వెళ్లారు. దీంతో కోర్టు స్టే ఇవ్వడంతో నాటి అవిశ్వాసానికి బ్రేకులు పడ్డాయి. తిరిగి అదే కార్పొరేటర్లు మరోసారి అవిశ్వాసం పెట్టడంతో అధికారులు ఈ నెల 21న ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్పొరేటర్లకు నోటీసులను అందజేశారు.

మైనర్‌పై అఘాయిత్యానికి యత్నం..

- **నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్ష**

ఖైరతాబాద్, మార్చి 20 : మైనర్‌పై అఘాయిత్యానికి యత్నించిన కేసులో నిందితుడికి నాంపల్లి కోర్టు 20ఏండ్ల జైలుశిక్ష విధించింది. సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ కథనం ప్రకారం.. 2021లో చింతలబస్తీకి చెందిన ఏడేండ్ల బాలికకు ఇంటి పక్కనే నివాసముండే తరుణ్(20) మాయమాటలు చెప్పి అఘాయిత్యానికి యత్నించాడు. ఇంటి యజమాని కొడుకు గమనించి అడ్డుకొని పోలీసులకు అప్పగించాడు. నిందితుడిపై పోక్సో, ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో తరుణ్‌కు 20 ఏండ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ నాంపల్లి 12వ అదనపు మెజిస్ట్రేట్ సెషన్స్ జడ్జి టి. అనిత బుధవారం తీర్పును వెలువరించారు. అదేవిధంగా.. బాధితురాలికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరపున రూ. 4 లక్షల పరిహారం అందించాలని ఆదేశించారు.

గడువు ముగిసిన తినుబండారాలు స్వాధీనం

శంషాబాద్ రూరల్, మార్చి 20: గడువు ముగిసిన తినుబండారాలను బుధవారం ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌జీఐఏ పోలీసుల కథనం ప్రకారం.. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సాతంరాయి ప్రాంతంలో గడువు ముగిసిన తినుబండారాలను కిరాణా షాపులలో తక్కువ ధరకు అమ్ముతున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో ఎస్‌వోటీ పోలీసులు సాతంరాయిలో సైబుద్దీన్ కిరాణా దుకాణంపై దాడిచేశారు. ఆ దుకాణంలో ఉన్న గడువు ముగిసిన వివిధ రకాల తినుబండారాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బెల్ట్‌షాపులపై దాడులు

సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం ఏడు ప్రాంతాల్లో బెల్ట్ షాపులపై దాడులు చేసి, 197 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మద్యం విలువ రూ. 1,34,503 ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఘనంగా శ్యాంబాబా శోభాయాత్ర

అత్తాపూర్, మార్చి 20: అత్తాపూర్ శ్యాంబాబా మిత్రమండలి ఆధ్వర్యంలో శ్యాంబాబా నిషాన్ శోభాయాత్రను బుధవారం ఘనంగా నిర్వహించారు. వందలాది మంది శోభాయాత్రలో పాల్గొన్నారు. శోభాయాత్రలో బాబా కీర్తనలు, భజనలు, నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. అత్తాపూర్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర కాచిగూడలోని శ్యాంబాబా మందిరం వరకు కొనసాగింది. ప్రజలు శోభాయాత్రకు స్వాగతం పలికారు.

న్యాయం జరిగేవరకూ పోరాడుతాం..

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 20: ఎన్నో ఏండ్లుగా పనిచేస్తున్న కార్మికులకు న్యాయం జరిగేవరకూ పోరాడుతామని సీఐటీయూ కాటేదాన్ క్లస్టర్ కన్వీనర్ జె.రుద్రకుమార్ అన్నారు. కాటేదాన్ ఇండస్ట్రియల్ ఏరియాలో సబీనా ఫుడ్స్ బిస్కెట్ పరిశ్రమలో కనీసవేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించకపోవడం దారుణమని అన్నారు. కృష్ణాగోపాల్‌గౌడ్ 14 ఏండ్లుగా మిషన్ ఆపరేటర్, మెయింటెనెన్స్ విభాగాల్లో పని చేస్తున్నాడన్నారు. జీతాలు పెంచాలని కోరినా పట్టించుకోవడం లేదని అన్నారు. బుధవారం పరిశ్రమకు వెళ్లి కార్మికుడికి అండగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ కాటేదాన్ క్లస్టర్ నాయకులు వి.ప్రవీణ్‌కుమార్, జి.హనుమంతు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన

ఖైరతాబాద్, మార్చి 20: సైబర్ మోసాలపై సీసీఎస్ పోలీసులు ఖైరతాబాద్‌లోని గణేశ్ మండపంలో విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సీతారాములు మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు డెబిట్, క్రెడిట్ కార్డు ఓటీపీ ఫ్రాడ్‌తో పాటు వ్యక్తిగత సమాచారాన్ని అడుగుతారని, ఎట్టిపరిస్థితుల్లో ఆ విషయాలను చెప్పొద్దని సూచించారు. అదేవిధంగా ఆన్‌లైన్, వాట్సాప్‌లలో వ్యక్తిగత ఫొటోలను సైతం షేర్ చేయవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

గంగా తెప్పోత్సవాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించాలి

ఖైరతాబాద్, మార్చి 20: ఖైరతాబాద్‌లో ప్రతి ఏడాది గంగపుత్రులు నిర్వహించే గంగా తెప్పోత్సవాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని తెలంగాణ గంగా తెప్పోత్సవ కమటీ అధ్యక్షుడు మల్కు మహేందర్‌బాబు కోరారు. నెక్లెస్ రోడ్‌లోని గంగమ్మ ఆలయాన్ని రాష్ట్ర ఫిషరీస్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మెట్టు సాయికుమార్ బుధవారం సందర్శించారు. మహేందర్‌బాబు మాట్లాడుతూ.. కార్పొరేషన్ ద్వారా గంగపుత్ర మహిళలకు ఉపాది అవకాశాలు, సబ్సిడీ రుణాలు అందించాలన్నారు. గంగమ్మ ఆలయ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. అనంత